క్లుప్తంగా

10 నుంచి డాక్టర్ కాసరనేని శత జయంతి ఉత్సవాలు

పాత గుంటూరు: కేఆర్‌కే ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు కాసరనేని సదాశివరావు శత జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై 10న సాయంత్రం 6 గంటలకు పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ, అనంతరం పెదకాకాని గంగోత్రి వారి అస్తికలు నాటిక ప్రదర్శన, 11న సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణ రాయబారం, పడకసీను, హాస్యవల్లరి, 12న ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం, సాయంత్రం 6 గంటలకు సభ అనంతరం కొత్తతరం కొడుకులు నాటిక ప్రదర్శించనున్నట్లు వివరించారు. కళాభిమానులు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం



ఉరుసు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు

లక్ష్మీపురం: చిన్నబజారులోని చిన్నమౌలానా పంజా ప్రాంతంలో హజరత్ సయ్యద్ అవులియా బాబా, సిద్ధిక్ బాబా, సిద్ధిక్ అమ్మజాన్ వారి ఉరుసు మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దర్గా ముతవల్లి షేక్ ఖాదర్‌బాబా సారథ్యంలో బాబా సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలతో కలిసి బాబా దర్గాకు గంధం సమర్పించారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఖ్వాజి సయ్యద్ అజీమ్, కడప అమీన్ పీర్‌దర్గా శిష్య బృందం యాసీన్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథకు ఆపన్నహస్తం



గుంటూరు వెస్ట్: మన కళ్లముందు అనేక మంది పడే ఇబ్బందులను, బాధలను కొందరూ చూస్తూ వెళ్లిపోతారు. మరికొందరు మాట సాయం, ఇంకొందరు తోచిన సాయం చేస్తుంటారు. సాయమేదైనా కొందరు అభాగ్యులకు ఎంతో ఊరట కలిగిస్తుంది. అటువంటి సంఘటన మంగళవారం గుంటూరులో చోటుచేసుకుంది. పాక్షికంగా మతి చెలించిన శ్రీనివాస్ (సుమారు 35 సంవత్సరాలు) అనే వ్యక్తికి నెల రోజుల క్రితం ఎడమకాలు విరిగింది. దీంతో అతడు కదలలేని స్థితిలో స్థానిక మణిపురం వంతెనకు ఒక పక్కగా పడుకుని తీవ్ర బాధను భరిస్తూ నానా అవస్థలు పడుతున్నాడు. అటుగా వెళ్లే సహృదయా సేవల సంఘం సభ్యులు అత్తోట డేవిడ్ జయరాజ్, రవి, సుద్దపల్లి రవీంద్రబాబు, అత్తోట ప్రభుదాస్ సదరు వ్యక్తి బాధను గమనించారు. వెంటనే మదర్ థెరిసా సిస్టర్స్ ఆశ్రమాన్ని సందర్శించి విషయాన్ని చెప్పి శ్రీనివాస్‌కు ఆశ్రయం కల్పించాలని వేడుకున్నారు. వెంటనే ఆశ్రమ నిర్వాహకులు ఒప్పుకున్నారు. సేవా సంఘం సభ్యులు శ్రీనివాస్‌ను వీల్‌చైర్‌పై ఆశ్రమానికి తరలించారు. ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్‌కు సపర్యలు ప్రారంభించారు. సేవా సంఘం సభ్యులను స్థానికులు అభినందించారు.

12న జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా స్థాయి బాల బాలికల జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 12న స్థానిక ఎన్‌జీఓ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి ఈ.శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 5 నుంచి 7 వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు పంపిస్తామన్నారు. వయస్సు ధ్రువీకరణతో పాటు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 93969 90666 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆర్థిక ప్రణాళికపై అవగాహన అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో యువతరానికి ఆర్థిక ప్రణాళికపై అవగాహన అవసరమని ఏజెస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ హెడ్ వి.వెంకట సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఆర్థిక ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆర్థిక అంశాలపై చక్కని అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. సదస్సులో కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర కె.లలిత, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డి.కళ్యాణి, సహా ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

పాత గుంటూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు కేవలం 7 వారాలే గడువు ఉందని, నగరపాలక సంస్థకు బకాయి ఉన్న పన్ను వసూళ్లను ప్రతి రోజు రూ.కోటి వసూళ్లు లక్ష్యంగా పనిచేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెవెన్యూ వసూళ్లు, రీసర్వే, రోడ్ల విస్తరణ పనులు తదితర ఫీజు వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చి చివరి నాటికి బకాయి ఉన్న రూ.70 కోట్ల వసూళ్లకు ప్రతి రోజు రూ.కోటి వసూళ్లు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. ఆస్తి పన్ను రూ.2 లక్షలు మించి, బకాయి ఉన్న రూ.17 కోట్ల వసూళ్లపై ఆర్‌ఓలు, డెప్యూటీ కమిషనర్లు బాధ్యత వహించాలన్నారు. నీటి చార్జీల వసూళ్లు నూరు శాతం జరగాలని, కమర్షియల్ భవనాలు కూడా బకాయిలు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసూలు కాకపోతే ట్యాప్ కనెక్షన్ తొలగించాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న నగర కమిషనర్ కీర్తి చేకూరి

షాపుల అద్దెలు వసూళ్లు చేయాలని, రెన్యువల్స్‌ని వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. నగరపాలక సంస్థ మరుగుదొడ్ల నుంచి చెల్లించాల్సిన బకాయిలను ఈ నెల 13 నాటికి జమ చేయించాలని ఆదేశించారు. చౌడవరంలో కొన్ని అసెస్మెంట్‌లకు దీర్ఘకాలంగా వినియోగం మేరకు పన్ను విధించక పోవడం వల్ల భారీ మొత్తంలో ఆర్థిక నష్టం కలిగిందని, నిర్లక్ష్యంగా ఉన్న సంబంధిత అడ్మిన్, ఆర్‌ఐలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌడవరం 187 వార్డ్ సచివాలయం అడ్మిన్ కార్యదర్శి తులసి రాంను సస్పెండ్ చేస్తూ, ఆర్‌ఐ షేక్ సలాంకు చార్జి మెమో ఇవ్వాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. రీసర్వే ఆశించిన స్థాయిలో జరగడం లేదని, వచ్చే వారానికి ప్రతి సచివాలయం పరిధిలో రీసర్వే 75 శాతం మించాలన్నారు. బకాయిలు చెల్లించిన వారి హోర్డింగ్‌లకు ఫిబ్రవరి 15 నుంచి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల వారీగా సమీక్షించి, టీడీఆర్ బాండ్లు జారీ చేయాల్సిన వారికీ డాక్యుమెంట్స్ ప్రక్రియ పూర్తి చేయాలని, నష్ట పరిహారం చెల్లించిన గృహాల స్వచ్ఛంద తొలగింపు వేగవంతం చేయాలని ఆదేశించారు. చిన్నేరుకుంట, రెడ్డిపాలెం, టిలికాంనగర్, గడ్డిపాడుల్లో రోడ్డు విస్తరణకు నోటీసులు సిద్ధం చేయాలన్నారు. ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనుల్లో గైర్హాజరు అయిన 5 మంది ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఆర్‌ఓలు, ఆర్‌ఐలు, అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

లక్ష్మీపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద పోస్టాఫీసులోని వ్యవసాయ సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బడ్జెట్‌లో రూ.89.400 కోట్లు కేటాయించగా, ఇప్పుడు బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. గత బడ్జెట్ కంటే ఇప్పటి బడ్జెట్‌లో రూ.29 వేల కోట్లు తగ్గించి కేటాయించడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని చెబుతూ, బడ్జెట్‌ను పెంచుకుంటూ వెళ్లాల్సిన కేంద్రం తగ్గిస్తోందని ఆరోపించారు. ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు దోచిపెడుతూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ కార్డు కలిగిన అందరికి పని కల్పించేందుకు కేంద్ర బడ్జెట్ రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో తన్నీరు ప్రభుదాస్, ముప్పాళ్ల శివశంకరరావు, వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి, జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, పలువురు హెడ్‌పోస్టాఫీసులోని డీఎంకు వినతి పత్రం అందజేశారు.



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పాత గుంటూరు: బీజేపీ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. బ్రాడిపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు అధ్యక్షతన కేంద్ర బడ్జెట్, ప్రజలపై ప్రభావం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, కడప ఉక్కు కర్మాగారానికి నిధులు కేటాయింపులేదన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపారని విమర్శించారు. కరోనా నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పెంచే చర్యలు బడ్జెట్‌లో లేవన్నారు. గ్రామీణ ఉపాధికి గత బడ్జెట్ కంటే రూ.30 వేల కోట్లు తగ్గించారన్నారు. ఈ బడ్జెట్‌ను ప్రజలంతా ఐక్యంగా వ్యతిరేకించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించలేదన్నారు. యువతకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టలేదన్నారు. మైనార్టీలకు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్, సీపీఐ నాయకులు హనుమంతరావు, సీపీఐ (ఎం.ఎల్) నాయకులు యు.నాగేశ్వరరావు, సీపీఐ (ఎం.ఎల్) రెడ్‌స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు మన్నవ హరిప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బి.బ్రహ్మయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, వై.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులకు ఉచిత మెంటర్‌షిప్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్–1 రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ రాణిసుస్మితతో ఉచిత మెంటర్‌షిప్ అందిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ప్రతి రోజూ రాసే సమాధానాలను క్షుణ్ణంగా పరిశీలించి, మరింత మెరుగ్గా సమాధానాలు రాసే విధానంతో పాటు ప్రిపరేషన్ టిప్స్, ఆన్సర్ రైటింగ్, జీఎస్ తదితర అంశాలపై తగు సూచనలు, సలహాలు ఇస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించే ఉచిత మెంటర్‌షిప్‌ను మెయిన్స్ పరీక్ష పూర్తయ్యే వరకు ఉపయోగించుకోగలరన్నారు. పూర్తి వివరాలకు 040–35052121, 91332 37733 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా బాబా మందిర వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు ఈస్ట్: అమరావతి రోడ్డులోని శ్రీవెంకటేశ్వర కాలనీలో షిరిడీ సాయి ధ్యాన మందిరం 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. షిరిడీ సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. విశేష అలంకరణ చేసి మంగళహారతులు ఇచ్చారు. భక్తుల భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి బాబాకు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు చేశారు. షిరిడీ సాయి ఆధ్యాత్మిక, సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ, వృద్ధుల ఆశ్రమంలో పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. గోరంట్ల ఐడీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ షిరిడీ సాయి ఆధ్యాత్మిక సేవా సమితి చేస్తున్న ఆధ్యాత్మిక, సమాజ సేవ అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఓవీ రమణ, అధ్యక్షుడు విశ్వనాథం పాల్గొన్నారు.



బాబాకు పూజలు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, డాక్టర్ ఓవీ రమణ, విశ్వనాథం

జేఈఈ మెయిన్స్‌లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థుల ప్రతిభ


గుంటూరు ఎడ్యుకేషన్: ప్రకటించిన జేఈఈ మెయిన్స్–2023 మొదటి ఫేస్ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ జోనల్ మేనేజర్ ఎం.పూర్ణచంద్రరావు తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాల స్థాపించిన తరువాత మొటి బ్యాచ్ విద్యార్థులతోనే ఉత్తమ ఫలితాలను సాధించినట్లు తెలిపారు. షేక్ అబ్దుల్ సమీర్ 99.78 పర్సంటైల్, షేక్ ఆసిఫ్ 99.10 పర్సంటైల్ సాధించినట్లు వివరించారు. గుంటూరు క్యాంపస్ నుంచి 11 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా పర్సంటైల్ సాధించారని తెలిపారు. అధ్యాపకుల సమష్టి కృషి, విద్యార్థుల కృషితో ఉత్తమ ఫలితాలను సాధించడం ద్వారా, విద్యార్థుల తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, మధుకర్ రెడ్డి, సీఈవో సురేంద్రరెడ్డి, జీఎం రాజేంద్రప్రసాద్, జీఎం గోవర్ధన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డీన్ అప్పిరెడ్డి, అసిస్టెంట్ జోనల్ ఇన్‌చార్జి మహేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ సురేష్, ఉదయ్‌కుమార్, పద్మాకర్, రమేష్, శశిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జోనల్ మేనేజర్ పూర్ణచంద్రరావు, అధ్యాపకుల బృందం

నేటి నుంచి మస్తాన్‌షా దర్గా ఉరుసు మహోత్సవాలు

పాత గుంటూరు: నగరంపాలెంలోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా గంథం (ఉరుసు) మహోత్సవాలు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్త రావి రామ్మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న తెల్లవారుజామున చాందిని అలంకరణతో బాబా సమాధిపై గంథ మహోత్సవం, రాత్రి 11 గంటలకు గంథం ఊరేగింపు, అన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు. 9న సాయంత్రం 4 గంటలకు గంథం పంపిణీ, 5 గంటలకు దీపారాధన, అన్నదానం, 10న రాత్రి 10 గంటలకు గ్యార్మీషరీఫ్ (ఖురాన్ పఠనం), తెల్లవారుజామున ప్రసాదం పంపిణీ, 11న ఫకీర్లకు అన్నదానం, బాబాకు భక్తులు సమర్పించిన శేష వస్త్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. 12న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని బాబాను దర్శించుకోవాలన్నారు.



విద్యుత్ అలంకరణలో మస్తానయ్య దర్గా

వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి

నెహ్రూనగర్: జిల్లాలోని అన్ని రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రవాణా వాహనాలకు, ట్రాక్టర్ ట్రైలర్లకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు అమర్చుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై వెళ్లే వాహనాలను వెనుక నుంచి వస్తున్న వాహనాలు సరిగ్గా గుర్తించి ప్రమాదాలను నిరోధించడానికి రేడియం స్టిక్కర్లు సహాయపడతాయని తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి నెల వరకు రేడియం స్టిక్కర్లు అమర్చుకొని 814 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.8.14 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. రేడియం స్టిక్కర్లు లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: శానిటరీ షాపులో చోరీకి పాల్పడిన నిందితుడిని లాలాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపేట 2వ లైన్‌లో సుంకర కిరణ్ శానిటరీ షాపు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం కిరణ్ షాపులో రూ.2 లక్షల విలువైన శానిటరీ సామాను చోరీకి గురైంది. అయితే లాలాపేట పోలీసులు నిందితుడిని గుర్తించారు. షేక్ మస్తాన్‌వలిని మంగళవారం అరెస్టు చేసి చోరీ సొత్తు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రథమ బహుమతి కైవసం

గుంటూరు ఎడ్యుకేషన్: జగ్గయ్యపేటలోని ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 66వ ఏపీ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్ర ముస్లిం కళాశాల విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షమీమ్‌బేగం తెలిపారు. పొన్నూరు రోడ్డులోని కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ హెచ్‌ఈసీ విద్యార్థి షేక్ అబ్దుల్ మతీన్ అండర్–19 స్ట్రాంగ్‌మెన్‌గా నిలిచినట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ షేక్ సుభాని మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థి అబ్దుల్ మతీన్‌కు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ పాల్గొన్నారు.



అబ్దుల్ మతీన్‌ను అభినందిస్తున్న షేక్ సుభాని, అబ్దుల్ రెహ్మాన్, షమీమ్ బేగం

అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: గుంటూరు నడిబొడ్డున అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ భవన్‌ను పూర్తి స్థాయిలో నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మేడిద బాబురావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011 నుంచి అంబేడ్కర్ భవన్‌ను పూర్తి చేయాలని విన్నవిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీల పట్ల వివక్షతో అంబేడ్కర్ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేసిందన్నారు. దళితుల పక్షపాతి అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి అంబేడ్కర్ భవన్‌ను పూర్తి చేసేందుకు తగిన నిధులు కేటాయించాలని విన్నవించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఐజక్, యోహాన్, అనిల్, రవికుమార్, సుశీల్‌కుమార్, గాబ్రియేల్, జేమ్స్, నాగేశ్వరరావు, కెనడీ తదితరులు పాల్గొన్నారు.

మహిళ బ్యాగులో పర్సు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ బ్యాగులోని పర్సును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగడిగుంట రెండో లైనుకు చెందిన అద్దంకి హైమావతి బంగారు నగలు కొనేందుకు మంగళవారం గంటలమ్మ చెట్టు వీధికి వెళ్లింది. కొద్దిసేటి తరువాత బ్యాగు పరిశీలించగా అందులోని పర్సు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికి పర్సు చోరీకి గురైనట్లు గుర్తించింది. పర్సులో రూ.లక్ష నగదు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11న 'రేవు తిరగబడితే ఊరు కురుక్షేత్రం' పుస్తకావిష్కరణ

నెహ్రూనగర్: రజకులను అన్ని విధాల చైతన్యవంతులను చేయడమే తమ ఏకైక లక్ష్యమని రజక సమైక్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తెలిపారు. రేవు తిరగబడితే ఊరు కురుక్షేత్రమే అనే పుస్తక ఆవిష్కరణను ఈ నెల 11న నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం అమరావతి రోడ్డులో పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రజక జాతి ఎదుర్కొంటున్న అనేక సమస్యల వాస్తవ రూపం ఈ రేవు తిరగబడిత ఊరు కురుక్షేత్రం అనే పుస్తకం ప్రధాన సారాంశమన్నారు. బీహార్ మాజీ మంత్రి శ్యామ్ రజక, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మట్లపూడి పూర్ణచంద్రరావు, శ్రీరాములు, పోకల వసంత్, ఆవులమంద వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా
- 14వ డివిజన్ డీఎస్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గంలో ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల సమస్యలు పరిష్కారించడానికి తగిన కృషి చేస్తానని ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా స్పష్టం చేశారు. మంగళవారం నియోజకవర్గంలోని 14వ డివిజన్‌ డీఎస్ నగర్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్ నగర్ చివరి ప్రాంతాల్లోని కొన్ని వీధుల్లో రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, తాగునీరు కూడా అసంపూర్తిగా సరఫరా అవుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధ చేయాలని, తాగునీటి సరఫరాలో లోపం ఎక్కడఉందో తెలుసుకుని సమస్యను పరిష్కారించాలని అధికారులకు సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే సంబంధిత సచివాలయ సిబ్బంది లబ్ధిదారులతో దరఖాస్తు చేయించి పథకాలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ వేముల జ్యోతిపద్మజ, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, నాగేశ్వరరావు, అచ్చి కిరణ్, పల్లె శ్రీనివాసరెడ్డి, మహబూబ్ సుభాని, దుర్గా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరించి కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాస్‌నగర్‌లో నివాసం ఉండే చిలుకా గోపి (30) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. నాలుగు సంవత్సరాల క్రితం భార్యతో గొడవపడి విడిపోయాడు. గోపి మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నెల 2వ తేదీ గోపి మానసికంగా కుంగిపోయి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ త్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళులు

నెహ్రూనగర్: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎదగడానికి ఆయన భార్య రమాబాయి అంబేడ్కర్ కృషి, త్యాగం ఎంతో ఉందని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం రమాబాయి వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమాబాయి అంబేడ్కర్ స్ఫూర్తిని నేటి మహిళాలోకం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొరబండి ఆనంద బాబు, షేక్ ఖాదర్ వలీ, బత్తుల శివకుమార్, రత్న కుమార్, రజిని తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కోసం అనేక త్యాగాలు చేసిన రమాబాయి..

కుటుంబ గౌరవంకోసం నిరంతరం తన భర్తకు అండగా నిలిచిన మహనీయురాలు రమాబాయి అంబేడ్కర్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యా లయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత బహుజన పార్టీ నాయకులు

నవ భారత నిర్మాణానికి యువత సహకారం అవసరం

నెహ్రూనగర్: నవ భారత నిర్మాణానికి యువత సహకారం అవసరమని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, యానాం సంచాలకులు ఏఆర్ విజయరావు అన్నారు. భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్, యానాం, గుంటూరు వారి ఆధ్వర్యంలో జాతీయ యువ పార్లమెంట్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై స్టేట్ లెవల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విజయరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 2018 నుంచి ఇండియా ఫర్ టుమారో – ఇండియా ఫర్ ది వరల్డ్ అనే థీమ్ ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాల్లో బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.2 లక్షలు, ద్వితీయ స్థానం పొందినవారికి రూ.1.5 లక్షలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.లక్ష, 2 కన్సోలేషన్ బహుమతులు రూ.50 వేల చొప్పున, ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం గుంటూరు జిల్లా యువ అధికారి కిరణ్మయిదేవి రెడ్డి, భాష్యం బీఎడ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీహరి, గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజి ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ ప్రవీణ్, గుంటూరు జిల్లా నేషనల్ గ్రీన్‌కోర్ కో–ఆర్డినేటర్ డి.తిరుపతిరెడ్డి, హిందీ ప్రొఫెసర్ బి.వెంకటేశ్వరరావు, సైకాలజిస్ట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో ఫార్మసీ విద్యార్థులకు స్పోర్ట్స్‌మీట్

గుంటూరు ఎడ్యుకేషన్: నాలుగు జిల్లాల పరిధిలోని ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 24, 25వ తేదీల్లో స్పర్థ పేరుతో స్పోర్ట్స్‌మీట్–2కే23 నిర్వహిస్తున్నట్లు హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో మంగళవారం క్రీడా పోటీల బ్రోచర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ గుంటూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఫార్మసీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, క్యారమ్స్, చెస్, షార్ట్‌పుట్ పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆయా కళాశాలల నుంచి పోటీల్లో ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 23వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్ (98491 27290), వైస్ ప్రిన్సిపాల్ (94417 97744), ఫిజికల్ డైరెక్టర్ (95535 96879) నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.